క్లుప్తంగా

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



నాడు-నేడు పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ మౌలాలి

మిడుతూరు: విద్యార్థుల సామర్థ్యాలు పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ మౌలాలి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని కడుమూరు స్పెషల్ ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అర్థమయ్యే రీతిలో బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం నాడు-నేడు కింద చేపడుతున్న మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు.

సున్నిపెంట వాసికి డాక్టరేట్



కిరణ్‌కుమార్

శ్రీశైలం: మండల పరిధిలోని సున్నిపెంట గ్రామవాసి వేశపోగు కిరణ్‌కుమార్‌కు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య చల్లపల్లి స్వరూపారాణి పర్యవేక్షణలో క్యాస్ట్ రిలీజియన్ అండ్ స్టేట్ 'ఎ స్టడీ ఆఫ్ లిటిల్ కింగ్స్ డ్యూరింగ్ పోస్ట్ విజయనగర పీరియడ్' సిద్ధాంత గ్రంథం సమర్పించినందుకు గాను డాక్టరేట్ లభించినట్లు కిరణ్‌కుమార్ తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు వేస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: భోజనం-పెద్ద దేవళాపురం గ్రామాల మధ్య బీటీ రోడ్డు పనులు ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ డీఈ వెంకటరెడ్డి, ఏఈ వెంకటయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ దెబ్బ తిన్న బీటీ రోడ్డు స్థానంలో మరమ్మతులు చేయిస్తున్నామన్నారు.

పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): పట్టణంలోని జైకిసాన్ పార్కులో 6, 7, 25, 28వార్డులకు చెందిన లబ్ధిదారులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్ మొల్ల రబ్బాని పింఛన్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్లు తొలగిస్తున్నారనే తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దన్నారు. అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిషోర్, కౌన్సిలర్లు దేశెట్టి సుమలత, నాయబ్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశెట్టి శ్రీనివాసులు, ముజీబ్, రియాజ్, పఠాన్, రసూల్‌ఖాన్, చాంద్‌బాషా, ఇమ్రాన్, అబ్బాస్ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి



పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తపల్లి: ఇంటి పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది సూచించారు. గువ్వలకుంట్ల గ్రామంలో డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సిబ్బంది అవగాహన కల్పించారు. గ్రామంలోని ఇంటింటికి తిరిగి ఇళ్ల వద్ద పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తొట్లు, డ్రమ్ములలో నీటిని తరచూ పారబోసి శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ యశోద, ఏఎన్‌ఎంలు సరిత, శారద, ఎంఎల్‌హెచ్‌పీ శైలజ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు

బండిఆత్మకూరు: సస్యరక్షణ చర్యలతోనే అధిక దిగుబడులు సాధ్యమని మండల వ్యవసాయాధికారిణి స్వాతి తెలిపారు. శుక్రవారం లింగాపురం గ్రామంలో పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా విత్తన శుద్ధి పాటించాలన్నారు. అంతకుముందు రైతులు భూసార పరీక్షలు చేయించాలన్నారు. దీని వల్ల భూమిలో ఏఏ పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని అందుకు తగిన విధంగా కాంప్లెక్స్ ఎరువులు వేసుకోవాలన్నారు. దీని వల్ల పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగే అవకాశం ఉందన్నారు. సేంద్రియ ఎరువులను వినియోగించి భూసారాన్ని కాపాడుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు సునంద, వీఏఏలు మురళి, సామ్రాట్, రాజశేఖర్ పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సిద్దపల్లిలో బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సిద్దపల్లి, పెద్దనంతపురం గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే శిల్పా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. మూడున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని కోరారు. అంతకు ముందు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డికి సర్పంచ్ ఎల్లారెడ్డి, మండల ఉపాధ్యక్షురాలు పద్మజ, శ్రీనివాసులు, హనుమంతరెడ్డి, రమణారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాస్కర్, లక్ష్మీరెడ్డి, చిన్న దరగయ్య, రమణారెడ్డి, మురళీ, వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న యేసురత్నం

వెలుగోడు: కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వి.యేసురత్నం డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే కార్మికులను తొలగించే అధికారం యజమానులకు కల్పించడం, పని గంటలు, సెలవులు, ఓవర్ టైం, పని ప్రదేశంలో భద్రత తదితర నిబంధనలపై ప్రభుత్వాల ఇష్టారాజ్యం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు. కనీస వేతనం నెలకు రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కార్మిక సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని కోరారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి టి శ్రీనివాసులు, నాయకులు మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

11 నుంచి క్రీడాపోటీలు

కొత్తపల్లి/జూపాడుబంగ్లా: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈ నెల 11వ తేదీ నుంచి 4 రోజుల పాటు నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను నందికొట్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించనున్నామని కొత్తపపల్లి ఎంపీపీ కుసుమలత, జెడ్పీటీసీ సభ్యుడు సోమల సుధాకర్ రెడ్డి, నందికొట్కూర్ మున్సిపల్ కమిషనర్ కిషోర్, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్ శుక్రవారం వేర్వేరు ప్రకటనలో తెలిపారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బాల్‌బాడ్మింటన్ విభాగాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న కొత్తపల్లి మండల కబడ్డీ క్రీడాకారులు 9963147845, క్రికెట్ 9866311575, వాలీబాల్ 7729085200, బాల్‌బాడ్మిటన్ 9014349839, నందికొట్కూరు మండల క్రీడాకారులు 9441296379, 9912242273 నంబర్లను సంప్రదించి ఈనెల 9వ తేదీలోపు జట్ల పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

వాహనాల వేలంలో రూ.13.71లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సెబ్ అధికారులు

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): అక్రమ మద్యం రవాణా కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాల వేలంలో ప్రభుత్వానికి రూ.13,71,498ల ఆదాయం సమకూరిందని నందికొట్కూరు సెబ్ సీఐ రమేష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నంద్యాల అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో 81 బైక్‌లకు నందికొట్కూరు సెబ్ కార్యాలయం వద్ద వేలం పాట నిర్వహించారు. రూ.3వేల ధరావత్తు చెల్లించి 60 మంది వేలం పాటల్లో పాల్గొన్నారు. 79 బైక్‌లను పాట దారులు దక్కించుకోగా ప్రభుత్వానికి రూ.13,71,498ల ఆదాయం సమకూరింది.

రోటీ మేకర్ వితరణ



రోటీ మేకర్‌ను అందిస్తున్న పూర్వ విద్యార్థులు

శ్రీశైలంప్రాజెక్ట్: మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలకు పూర్వ విద్యార్థులు శుక్రవారం రోటీ మేకర్‌ను విరాళంగా అందజేశారు. రూ.80 వేలు విలువ చేసే రోటీ మేకర్ విద్యార్థుల అల్పాహారం తయారీకి ఉపయోగపడుతుంది.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి



మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ఆత్మకూరు: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని సీపీఎం పట్టన కార్యదర్శి రణధీర్ కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, కమిషనర్ శ్రీనివాసరావులకు శుక్రవారం సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఆర్టీసీ బస్టాండ్, గౌడ్ సెంటర్, రఘునాథ్ సెంటర్, నంద్యాల టర్నింగ్, సాయిబాబా గుడి ఆర్చ్, కోర్టు రహదారి, గాంధీ పార్క్, పాతబస్టాండ్, సంగమేశ్వరం సర్కిల్ వద్ద వీధి దీపాలు లేకపోవడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో పార్టీ నాయకులు స్వాములు, సురేంద్ర, గణపతి, రాజేష్ తదితరులు ఉన్నారు.

బాలికకు గాయాలు

వెలుగోడు: రోడ్డు దాటుతున్న బాలికను టూరిస్టు బస్సు ఢీకొనడంతో గాయాలపాలైంది. దోర్నాల గ్రామానికి చెందిన నాగేశ్వరరావు కూతురు రాజేశ్వరి పట్టణంలోని క్రాంతి వికలాంగుల స్కూల్‌లో 6వ తరగతి చదువుతోంది. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఆత్మకూరు-నంద్యాల ప్రధాన రహదారి దాటుతుండగా రాజేశ్వరిని గుజరాత్‌కు చెందిన యాత్రికుల బస్సు ఢీకొంది. ఈ ఘటనలో రాజేశ్వరి గాయపడటంతో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నంద్యాల ఆసుపత్రికి తరలించారు.

పండ్లతోటల పెంపకంతో అధిక లాభాలు

జూపాడుబంగ్లా: పండ్లతోటల పెంపకం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని ఎంపీడీఓ మంజులవాణి, ఏపీఓ గౌరీబాయి రైతులకు సూచించారు. శుక్రవారం వారు జూపాడుబంగ్లా సమీపంలో రైతులు సాగుచేసిన డ్రాగన్‌ఫ్రూట్స్, జామ తోటలను పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా రైతులకు రాయితీపై పండ్లతోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తుందన్నారు. ఇప్పటికే మండలం వ్యాప్తంగా 24 మంది రైతులకు 32.50 ఎకరాల్లో డ్రాగన్‌ఫ్రూట్స్, జామ, మామిడి, మునగ, మల్లె తోటల పెంపకానికి రాయితీలు ఇచ్చినట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న సన్న, చిన్నకారు రైతులు పొలం పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డులతో ఉపాధిహామీ పథకం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

మహా సభలను జయప్రదం చేయండి

పాములపాడు: ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులో నిర్వహించే ఆవాజ్ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని ఆవాజ్ కమిటీ మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆవాజ్ కమిటీ మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పని చేస్తుందన్నారు. సమావేశంలో కమిటీ మండల ప్రధాన కార్యదర్శి బషీర్, నాయకులు ఖాశీం, ఉస్మాన్, షర్ఫుద్దీన్‌అలీ, అన్సర్ పాల్గొన్నారు.

ఈ-క్రాప్ తప్పనిసరి

ఆత్మకూరు: ఈ ఏడాది రబీలో సాగు చేసిన పంటలకు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఆత్మకూరు రైతు భరోసా కేంద్రం చైర్మన్ బైరాపురం మహబూబ్‌బాషా రైతులకు సూచించారు. పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఈ-క్రాప్ నమోదు చేయించుకున్న పంటలకు పరిహారం అందుతుందన్నారు. సమావేశంలో ఎంపీఈఓ రవిగౌడ్, సావిత్రీబాయి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు నబీసాహెబ్, ఇబ్రహీం, కలిముల్లా, లింగమూర్తి, రసూల్ పాల్గొన్నారు.

శ్రీరాముడి కల్యాణానికి తలంబ్రాలు సిద్ధం

మహానంది: చైత్ర శుద్ధ శ్రీరామనవమి సందర్భంగా శ్రీరాముడి కల్యాణోత్సవానికి తలంబ్రాలు సిద్ధం చేస్తున్నట్లు మహానంది ఆర్యవైశ్య సంఘం మహిళలు తెలిపారు. శుక్రవారం వారు ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, పండితులు రవిశంకర అవధాని, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ హరినాథ్‌లను కలిసి కొత్త వడ్లను శుద్ధి చేసి ఒలవడం ప్రారంభించారు.

రోడ్డుప్రమాదంలో యువకుడి దుర్మరణం

● మరొకరికి గాయాలు

ఆత్మకూరు: పట్టణ శివారులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. మండలంలోని అమలాపురం చెంచుగూడేనికి చెందిన నాగన్న(22) బైక్‌పై ఆత్మకూరుకు బయలుదేరాడు. పట్టణ సమీపానికి చేరుకోగానే ఎదురుగా వస్తున్న ఆటో బైక్‌ను ఢీకొంది. ప్రమాదంలో నాగన్న అక్కడికక్కడే మృతి చెందగా ఆటోలో డ్రైవర్ పక్కన కూర్చున్న ఇందిరేశ్వరం గ్రామానికి చెందిన సుమంత్ తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108లో ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కృష్ణమూర్తి తెలిపారు.

అన్నదాన పథకానికి విరాళం

మహానంది: వైఎస్సార్ జిల్లా పులివెందుల పట్టణానికి చెందిన సాయిఫల్గుణరెడ్డి, సాయి సంకల్ప్‌రెడ్డి, మహేశ్ కరణ్‌లు రూ.5,116 చొప్పున శుక్రవారం అన్నదాన పథకానికి విరాళం అందించారు. ఆలయ ఇన్‌స్పెక్టర్ హరినాథ్ దాతలకు స్వామి, అమ్మవారి ప్రసాదాలు, బాండ్లు అందజేశారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలను ఆర్పుతున్న గ్రామస్తులు

జూపాడుబంగ్లా: మండల కేంద్రంలోని నీలిపల్లె పేటకు చెందిన దావీదు పశుగ్రాం దగ్ధమైంది. పశువుల కోసమని కల్లంలో 7 బండ్ల పశుగ్రాసాన్ని నిల్వ చేసుకున్నాడు. తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయింది. మంటలను గ్రామస్తులు ఆర్పివేసినా అప్పటికే పూర్తిగా కాలిపోయిందని, రూ.50 వేల నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు.

మెనూ పాటించాలి

పగిడ్యాల: మధ్యాహ్న భోజనంలో మెనూ పాటించాలని ఎంఈఓ సుభాన్ సూచించారు. శుక్రవారం కొత్త పాలమర్రి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. రోజు వారి మెనూ పాటించకపోతే ఏజెన్సీ రద్దు చేసి, హెచ్‌ఎంపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించారు. ఎంఈఓ వెంట హెచ్‌ఎం షంషూర్‌ఖాన్ ఉన్నారు.

అనుమతిలేని మందులు విక్రయిస్తే దుకాణాలు సీజ్



రికార్డులను తనిఖీ చేస్తున్న వ్యవసాయాధికారి కృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: అనుమతిలేని రసాయనిక మందులు, విత్తనాలు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని మండల వ్యవసాయ అధికారి కృష్ణారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన జూపాడుబంగ్లాలోని మనగ్రోమోర్ సెంటర్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన దుకాణం దారులతో మాట్లాడుతూ నిల్వ ఉన్న రసాయనిక ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందుల వివరాలు, ధరలను సూచిస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మార్పీ ఎంత ఉంటే అంతకే విక్రయించాలన్నారు. అధిక ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

11న కానిస్టేబుల్ మోడల్ పరీక్ష

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): ఏపీ పోలీసు కానిస్టేబుల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న నియోజకవర్గంలోని అభ్యర్థులకు ఈనెల 11న నందికొట్కూరులోని నవ్య సింధు అకాడమీ ఆధ్వర్యంలో మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ రామేశ్వరప్ప తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అభ్యర్థులకు పేపర్‌కు అవగాహన కల్పించడంతో పాటు మనోధైర్యం నింపటానికి పరీక్ష ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న వారు మధ్యాహ్నం 2 గంటల్లోపు అకాడమీ వద్దకు చేరుకోవాలన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



బుక్‌లెట్ అందజేసి పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

● ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

జూపాడుబంగ్లా(నందికొట్కూరు): అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందజేస్తామని నందికొట్కూరు ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగాంగా ఆయన శుక్రవారం శుక్రవారం నందికొట్కూరులోని బైరెడ్డి నగర్‌లో పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం మంజూరు చేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. మూడున్నరేళ్లలో పొందిన లబ్ధిని వివరించారు. కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం పనులతో పాటు ఇళ్ల స్థలాలు ఇళ్లు మంజూరు చేయించాలని, తాగునీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరాగా.. వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కిషోర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించే దిశగా సాగుతున్నామన్నారు. కొన్నిచోట్ల ప్రజలు తెలియజేసే చిన్న చిన్న సమస్యలను అధికారుల సహకారంతో అక్కడికక్కడే పరిష్కరించటం ఆనందం కలిగిస్తుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రబ్బాని, తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, సహకార సొసైటీ చైర్మన్ సగినేల హుసేనయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటస్వామి, వలిబాషా, భాస్కర్‌రెడ్డి, శంకర్, రమేష్, పట్టణ సీఐ విజయభాస్కర్, ఎస్‌ఐ ఎన్‌వీ రమణ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ వాసుదేవ గుప్తా

బండిఆత్మకూరు: ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో ఇంటి నిర్మాణాలు చేపట్టి త్వరగా పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ వాసుదేవ గుప్తా, తహసీల్దారు ఉమారాణి లబ్ధిదారులకు సూచించారు. శుక్రవారం సంతజూటూరు గ్రామంలో లబ్ధిదారుతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మార్చి చివరినాటికి ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవడానికి ప్రభుత్వం తక్కువ ధరతో సిమెంట్, స్టీలు సరఫరా చేస్తుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ సుంకిరెడ్డి, కార్యదర్శి శేషన్న, ఇంజినీరింగ్ అసిసెంట్ నాగేంద్ర పాల్గొన్నారు.

భూ రికార్డుల స్వచ్ఛీకరణపై దృష్టి సారించండి

● జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

నంద్యాల: భూ తగాదా సమస్యలను పరిష్కరించి, భూ రికార్డుల స్వచ్ఛీకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టర్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జాయింట్ కలెక్టర్ నిశాంతితో కలిసి భూ హక్కు పత్రాల పంపిణీ, మ్యుటేషన్ దరఖాస్తులు, పీఓఎల్‌ఆర్ రీసర్వే, జగనన్న శాశ్వత భూ హక్కు - భూరక్ష పథకం, స్పందన అర్జీలు, పౌర సరఫరాలు, 90 రోజుల ఇళ్ల పట్టాలు, కోర్టు కేసుల సత్వర పరిష్కారం తదితర అంశాలపై తహసీల్దారులు, ఆర్‌డీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ భూ ఆక్రమణలు, రెవెన్యూ రికార్డులో సవరణలు, పట్టాదారు పాసు పుస్తకాల మంజూరులో లోపాలు తదితర అంశాలపై ప్రజల నుంచి అధికంగా దరఖాస్తులు వస్తున్నాయని, వీటన్నింటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించాలని సూచించారు. భూ రికార్డుల స్వచ్ఛీకరణకు రెవెన్యూ అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని, గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వాల్యుయేషన్, సమగ్ర రీ సర్వే తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించాలని చెప్పారు. మ్యుటేషన్ కరెక్షన్స్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలని, భూ రీసర్వే, ఫైనల్ ఆర్ఓఆర్ పూర్తయిన గ్రామాల్లో భూ హక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందన దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి 39 రీఓపెన్ దరఖాస్తులు, విత్ ఇన్ ఎస్‌ఎల్‌ఏలో ఉన్న 775 దరఖాస్తులు, ఏపీ సేవా సర్వీసులు బియాండ్ ఎస్‌ఎల్‌ఏలో ఉన్న 414 దరఖాస్తులను నిర్ణీత కాల గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి మాట్లాడుతూ జిల్లాలోని 62 గ్రామాల్లో ఎస్సీల శ్మశాన వాటికలకు ప్రభుత్వ భూములను గుర్తించి సోమవారంలోపు ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. ప్రభుత్వ భూములు లభ్యం కాకపోతే దాతలను గుర్తించాలన్నారు. ఇళ్ల పట్టాల మంజూరుకు ఎంపిక చేసిన ల బ్ధిదారులను నిబంధనల మేరకు క్షేత్రస్థాయిలో విచారించి నివేదికలను సమర్పించాలని చెప్పారు. అనర్హత కలిగిన లబ్ధిదారులకు మంజూరు చేస్తే సంబంధిత వీఆర్‌ఓ, తహసీల్దార్లను బాధ్యులను చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. జాతీయ రహదారులు 340సి, 340బి, 167లకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని సూచించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, డోన్ ఆర్‌డీఓ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'స్వామిత్వ'పై అధికారులకు అవగాహన



వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన అధికారులు

పగిడ్యాల: గ్రామీణ ప్రజలకు ఆస్తి పత్రాలను పంపిణీ చేసే సర్వే ఆఫ్ విలేజస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రొవైజ్డ్ టెక్నాలజీ ఇన్ విలేజ్ ఏరియాస్(స్వామిత్వ) కార్యక్రమంపై పంచాయతీ అధికారులు, సర్వేయర్లకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ అధికారులు శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆత్మకూరు డివిజనల్ పంచాయతీ ఇన్‌చార్జ్ అధికారిణి కవిత, ఈఓఆర్డీ పుల్లయ్య, పంచాయతీ కారదర్శులు, సర్వేయర్లు పాల్గొన్నారు.

కృష్ణానదిలో బోట్ ప్రయాణాలకు అనుమతి

ఆత్మకూరు: తెలంగాణ రాష్ట్రంలోని సింగోటం జాతరకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం కృష్ణానదిపై బోట్ ప్రయాణాలకు ఆంక్షలతో కూడిన అనుమతి ఇస్తున్నట్లు డీఎస్పీ శృతి తెలిపారు. శుక్రవారం ఆమె వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. బోట్ కండీషన్ సర్టిఫికెట్ ఉండాలని, లైసెన్స్ ఉన్న వారే బోట్ నడపాలని, ప్రయాణికులందరికీ లైఫ్ జాకెట్లు సమకూర్చాలని బోట్ నిర్వాహకులకు సూచించారు. ఈ నిబంధనలు పాటించకుండా బోట్లు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఆర్డీఓ దాస్, సీఐలు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

మరకత లింగేశ్వరుడికి అన్నాభిషేకం



మహానంది: గాజులపల్లె రైల్వేస్టేషన్ గ్రామంలో వెలిసిన శ్రీ గంగాగౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామికి జన్మనక్షత్రం ఆరుద్ర సందర్భంగా శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు ఆధ్వర్యంలో అర్చకులు, పండితులు స్వామివారికి అన్నాభిషేకం నిర్వహించారు.



భ్రామరికి లక్ష కుంకుమార్చన

శ్రీశైల భ్రమరాంబాదేవికి శుక్రవారం పరోక్ష సేవగా లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అర్చకులు, పండితులు ముందుగా పూజా సంకల్పాన్ని పఠించారు. అనంతరం లక్ష కుంకుమార్చన చేశారు. అలాగే పౌర్ణమిని పురస్కరించుకుని సాయంత్రం అమ్మవారికి ఊయల సేవ, పల్లకీ సేవ నిర్వహించారు. – శ్రీశైలం టెంపుల్